సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం, 22, సెప్టెంబర్, 2023



ప్రభుత్వాస్పత్రిలో కిటకిట

గత వారం రోజులుగా ఇల్లెందు ప్రభుత్వ వైద్య శాలకు జ్వర పీడితులు క్యూ కడుతున్నారు. వీరిలో టైఫాయిడ్ బాధితులే ఎక్కువ. 8లో



ఎరియర్స్‌లో కోతలు..

పదకొండో వేజ్‌బోర్డు ఎరియర్స్‌లో కోతలు విధించడంతో సింగరేణి కార్మికులు అసంతృప్తికి గురవుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఒకటి రెండు చోట్ల చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్య కల్యాణ వేడుక గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేత, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. గురువారం సందర్భంగా స్వర్ణ లక్ష్మీ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఈఓ రజినీకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ న్యాయవాద మహాసభలకు ఎంపిక



రమేష్‌కుమార్ మక్కడ్

కొత్తగూడెంటౌన్: ఈ నెల 23, 24 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే అంతర్జాతీయ న్యాయవాద మహాసభలకు కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ ఎంపిక య్యారు. ఈ మేరకు గురువారం ఆయన కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంగ్లండ్ అండ్ వేల్స్ బార్ కౌన్సిల్, ది లా సొసైటీ ఆఫ్ ఇంగ్లండ్ అండ్ వెల్స్, కామన్‌వెల్త్ లాయర్స్ అసోసియేషన్ సహకారంతో న్యూఢిల్లీలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు తాను ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించే ఈ మహాసభల్లో భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి.వై.చంద్రచూడ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. న్యాయరంగంలో అంతర్జాతీయ సహకారం, న్యాయ నిపుణుల మధ్య అవగాహన, సహకారాన్ని ప్రోత్సహించడం, భౌగోళిక సరిహద్దులు, అధికారిక వ్యత్యాసాలను అధిగమించడం వంటి అంశాలపై సదస్సులో చర్చిస్తారని వివరించారు.

'సర్కారు' బోర్డుపై చంద్రబాబు ఫ్లెక్సీ

పట్టించుకోని అధికారులు

చండ్రుగొండ : కరోనా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో నాటి కలెక్టర్ ఎం.వి.రెడ్డి ఆధ్వర్యంలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో చండ్రుగొండ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలను ఆనుకుని ఈ బోర్డు పెట్టారు. ఆ తర్వాత కాలంలో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన కార్యక్రమాలను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆ బోర్డుపై ప్రదర్శించేవారు. అయితే గత మంగళవారం రాత్రి చంద్రబాబు అభిమానుల పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. చంద్రబాబును అరెస్టును నిరసిస్తూ శుక్రవారం కొత్తగూడెంలో జరిగే ర్యాలీ వివరాలు తెలియజేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా.. మూడు రోజులు గడుస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వ పథకాల నిమిత్తం ఏర్పాటు చేసిన బోర్డుపై చంద్రబాబు అభిమానులు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం ఏంటని, తమ పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన ఫ్లెక్సీలు కూడా దానిపై పెడతామని పలు పార్టీల వారు అంటున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఎంపీఓ తోట తులసీరాంను వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని చెప్పారు.

గుర్తింపుపై తర్జన భర్జన



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

'సింగరేణి' ఎన్నికలపై నేడు సన్నాహక సమావేశం

- హై కోర్టులో మరో పిటిషన్ దాఖలు
- ఎన్నికలపై ఎటూ తేల్చుకోలేకపోతున్న అధికార పార్టీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రెండేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై నేడు కీలక నిర్ణయం వెలువడనుంది. సంస్థలో చురుగ్గా పని చేస్తున్న 16 కార్మిక సంఘాలు, యాజమాన్య ప్రతినిధులతో నేడు కేంద్ర కార్మిక శాఖ హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించనుంది. గడిచిన రెండేళ్లుగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ అంశం ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు అన్నట్టుగా మారింది. ఇప్పటికే మూడు సార్లు ఎన్నికల నిర్వహణ వాయిదా పడింది. ఈ అంశంపై చివరిసారిగా ఈనెల 10న కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అయితే ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలి, ఓటర్ల జాబితా ఎప్పుడు ప్రకటించాలి తదితర అంశాలపై నేడు చర్చించాలని నిర్ణయించారు.

మరోసారి కోర్టుకు..

గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణపై సింగరేణి యాజమాన్యం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఓవైపు ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కార్మికశాఖకు చెబుతూనే.. మరోవైపు వాయిదా కోరుతూ పదేపదే హైకోర్టును ఆశ్రయించడాన్ని వారు తప్పు పడుతున్నారు. ఎన్నికల నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సింగరేణి యాజమాన్యం వేసిన పిటిషన్‌పై గురువారం వాదనలు జరగగా, తీర్పును రిజర్వ్ చేసి ఉంచారు. ఈ తీర్పునకు లోబడే కార్మిక శాఖ సైతం ఎన్నికల నిర్వహణపై కార్యాచరణ రూపొందించాల్సి ఉంటుంది.

ఇంతలో ఏమైంది..

గుర్తింపు సంఘం ఎన్నికలపై తాడోపేడో తేల్చుకోవాలనే వైఖరి నిన్నామొన్నటి వరకు ప్రభుత్వ వర్గాల్లో కనిపించింది. గుర్తింపు సంఘం ఎన్నికల్లో సానుకూల ఫలితాలు వస్తే ప్రతిపక్షాల బలంలో పస లేదని ఉధృతంగా ప్రచారం చేయాలనే అభిప్రాయానికి వచ్చింది. ఒకవేళ ప్రతికూల ఫలితాలు వస్తే లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందనే వాదనలు టీబీజీకేఎస్, బీఆర్ఎస్ శ్రేణుల్లో వినిపించాయి. అందుకు తగ్గట్టే ఎన్నికల నిర్వహణకు అభ్యంతరం లేదంటూ సింగరేణి యాజమాన్యం తేల్చి చెప్పింది. కానీ రెండు వారాలు గడవగానే ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. మరోసారి అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రయోగాలు ఎందుకనే వైఖరికే అధికార పార్టీ కట్టుబడిందనే ప్రచారం జరుగుతోంది.

ఓటమి భయమా?

తెలంగాణ అసెంబ్లీకి రెండుసార్లు జరిగిన సాధారణ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించింది. కానీ సింగరేణి బొగ్గు గనులు విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీకి చేదు ఫలితాలే వచ్చాయి. ప్రతికూల పరిస్థితుల నడుమ 2017లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) విజయఢంకా మోగించింది. కానీ, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఆ ఊపును కొనసాగించలేకపోయింది. దీంతో 2021 అక్టోబర్‌లో నిర్వహించాల్సిన గుర్తింపు సంఘం ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేస్తూ వస్తోంది. ఓసారి ఎన్నికలు నిర్వహిస్తే బొగ్గు ఉత్పత్తిపై ప్రతికూల ఫలితాలు వస్తాయని సింగరేణి యాజమాన్యం వాదిస్తే, మరోసారి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఉద్యోగులను కేటాయించడం కష్టసాధ్యమంటూ ఆయా జిల్లాల కలెక్టర్లు నివేదిక ఇచ్చారు. తాజాగా అసెంబ్లీ ఎన్నికలను సాకుగా చూపుతూ ఎన్నికల వాయిదాకు ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఓటు హక్కు ఎంతో విలువైనది

డీఈఓ వెంకటేశ్వరాచారి



పాల్వంచలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

పాల్వంచ : ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన వారంతా తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరా చారి అన్నారు. గురువారం పాత పాల్వంచ ఉన్నత పాఠశాలలో ఎన్నికల అవగాహనపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు జిల్లా స్థాయిలో పాటలు, కవితల పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో డీఈఓ మాట్లాడుతూ.. ఓటు నమోదును సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఓటు వేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.శ్రీరామ్మూర్తి, పి.సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయులు రమ, శ్యామల, చంద్రకళ, మోహన్‌రావు, హరి, మురళి పాల్గొన్నారు.

25 నుంచి డీఈఎల్ఈడీ, డీపీఎస్ఈ పరీక్షలు..

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 25వ తేదీ నుంచి జిల్లాలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ ప్రైమరీ స్కూల్ ఎడ్యుకేషన్ ద్వితీయ సంవత్సర పరీక్షలు జరుగుతాయని డీఈఓ వెంకటేశ్వరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 నుంచి అక్టోబర్ 3 వరకు చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఖేలో ఇండియా పోటీల్లో మూడు పతకాలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో గురువారం జరిగిన ఖేలో ఇండియా మహిళా రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు ఒక స్వర్ణ, రెండు కాంస్య పతకాలు వచ్చాయి. సింగరేణి ఉమెన్స్ కాలేజీకి చెందిన ఎం.ఇందు 3000 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం సాధించగా, అదే కాలేజీకి చెందిన ఎం.సింధు 200, 400 మీటర్ల పరుగు పందెంలో రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిద్దరినీ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్, అధ్యక్షుడు గొట్టపు రాధాకృష్ణ, కోచ్ మాలోత్ నరేష్, కళాశాల పీడీ డాక్టర్ సావిత్రి అభినందించారు.

జేఎల్ పరీక్ష ప్రశాంతం

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన జూనియర్ లెక్చరర్ (జేఎల్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 136 మంది అభ్యర్థులకు గాను పేపర్ -1 పరీక్షకు 96 మంది, పేపర్ -2 పరీక్షకు 94 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా పరీక్షకు చర్ల, గుండాల, మణుగూరు, ఇల్లెందు తదితర ప్రాంతాలకు చెందిన 15 మంది 10 నిమిషాలు ఆలస్యంగా రాగా, నిర్వాహకులు వారిని అనుమతించలేదు. రైలు గేటు పడడంతో ఆలస్యంగా వచ్చామని బతిమాలినా వారు ససేమిరా అనడంతో నిరాశతో వెనుదిరిగారు.

వరద నమోదు ఇక సులువు

- అందుబాటులోకి అత్యాధునిక పరికరం
- భద్రాచలంలో అధికారులకు శిక్షణ



పరికరాన్ని వినియోగించే విధానంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: గోదావరి తదితర నదులకు వరద వచ్చినప్పుడు వరద స్థాయి, ప్రవాహ వేగాన్ని గుర్తించి కచ్చితంగా వివరాలు నమోదు చేసేందుకు అత్యాధునిక పరికరం అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రప్రభుత్వం నేషనల్ హైడ్రాలజికల్ ప్రాజెక్టు కింద ఎకొస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్ అనే పరికరాన్ని తాజాగా కొనుగోలు చేసింది. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన ఇరిగేషన్ శాఖ హైడ్రాలజికల్ వింగ్ అధికారులు గురువారం భద్రాచలంలో పర్యటించిన జిల్లా అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ పరికరాన్ని వినియోగించి గోదావరి వరదల సమయంలో నీటి ప్రవాహాన్ని గుర్తించడం, ఇతర వివరాలను నమోదు చేయడంపై అవగాహన కల్పించారు. చీఫ్ ఇంజనీర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యాన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏఆర్ఎస్.శర్మ, మంజుల తదితరులు జిల్లా అధికారులకు శిక్షణ ఇచ్చారు. కాగా, రూ.కోట్ల విలువైన ఈ పరికరాన్ని అమెరికా నుంచి తెప్పించినట్లు సమాచారం. దీని వినియోగానికి ప్రత్యేక బోట్ కొనుగోలు చేయాల్సి ఉండగా, భవిష్యత్‌లో భద్రాచలానికి కూడా పరికరాన్ని కేటాయించే అవకాశముందని తెలిసింది. ఇందుకోసం ముందస్తుగా ఉద్యోగులకు శిక్షణ ఏర్పాటు చేశారని సమాచారం. శిక్షణలో ఇరిగేషన్ శాఖ పర్యవేక్షణ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాంప్రసాద్, సురేష్‌కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు వివరాలు మార్కింగ్ చేయాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్


భద్రాచలంటౌన్: పినపాక నియోజకవర్గంలో 80 సంవత్సరాలు పైబడిన ఓటర్ల వివరాలు మార్కింగ్ చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పీడబ్ల్యూడీ పెన్షనర్ల పేర్లు ఓటరు లిస్టులో మార్కింగ్ చేయాలని, ఈ జాబితాపై సీడీపీఓలు, పంచాయితీ సెక్రటరీలు, బీఎల్ఓలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా తయారు చేసే క్రమంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మణుగూరు ఎన్నికల నాయబ్ తహసీల్దార్ నాగరాజు, ఏఈఆర్ఓ రాఘవరెడ్డి, సిబ్బంది రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సయోధ్య

కలిసిపోయిన ఇల్లెందు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్



దమ్మాలపాటి వెంకటేశ్వరరావు



జానీపాషా

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా మధ్య గత ఏడాది కాలంగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్న చందంగా సాగిన వైరం ఎట్టకేలకు సమసిపోయింది. కొందరు పెద్దల సమక్షంలో ఖమ్మంలోని ఓ రహస్య ప్రదేశంలో జరిగిన సమావేశంలో ఇద్దరి మధ్య సయోధ్య కుదిరింది. ఇప్పటివరకు జరిగిన ఘర్షణలను పూర్తిగా మర్చిపోయి ఇక ముందు ఐక్యంగా సాగడమే ఎజెండాగా ఉండాలని పరస్పరం అంగీకరించారు. కౌన్సిలర్లను కూడా కలుపుకుని ఏకతాటిపై నడవాలని నిర్ణయించారు. గడిచిన ఏడాది కాలంగా ఇద్దరి మధ్య వైరంతో అటు అధికారులు, ఇటు కౌన్సిలర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. అభివృద్ధి పనులు, మున్సిపల్ పాలన కూడా ఆశించిన మేర ముందుకు సాగలేదు. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో దుమ్మెత్తి పోసుకోవడంతో పాటు కలెక్టర్, సీఎంఓ కార్యాలయం వరకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఆర్డీఓ స్థాయిలో విచారణ కూడా జరిగింది. అవిశ్వాసం కోరుతూ ఓ వర్గం కౌన్సిలర్లను రహస్య శిబిరానికి తరలించారు. ఇలా అనేక మలుపులు తిరిగిన మున్సిపల్ వైరం తారాస్థాయికి చేరింది. అయితే చైర్మన్ డీవీ, వైస్ చైర్మన్ జానీపాషా కలిసి చర్చించుకుని ముందడుగు వేశారు. వీరిద్దరూ వేర్వేరుగా తమ వర్గం కౌన్సిలర్లతో కూడా చర్చించారు. అయితే కొందరు కౌన్సిలర్లు విముఖత వ్యక్తం చేయగా, మరి కొందరు అంగీకరించినట్లు తెలిసింది.

పేదల బియ్యం పక్కదారి !

- జిల్లాలో రెచ్చిపోతున్న 'రేషన్' స్మగ్లర్లు
- అరికట్టడంలో అధికారులు విఫలం
- కఠిన చర్యలంటూ ప్రకటనలకే పరిమితం



ఛత్తీస్‌గఢ్‌కు బియ్యం రవాణా చేస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ అక్రమాలను అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కఠిన చర్యలు తీసుకుంటామంటూ ప్రకటనలు చేస్తున్నారే తప్ప అమలు చేసిన దాఖలాలు లేవు. జిల్లాలో నెలకు కనీసం పదిరోజులు ఎక్కడో ఒకచోట పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకుంటున్నారు. నిందితులను, బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించడంతో పాటు పోలీసులు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ఆ తర్వాత సివిల్ సప్లై అధికారులు ఏం చర్యలు తీసుకున్నారు, ఏం మాయ జరుగుతోంది అనేది మాత్రం ఎవరికీ అంతుపట్టడం లేదు.

శాఖాపరమైన చర్యలు శూన్యం..

జిల్లాలో ఎక్కువగా కూలీ పనులతోనే జీవనం సాగించే గిరిజనులకు రేషన్ బియ్యమే ఆధారం. అయితే ప్రతీ నెల బియ్యం ఎప్పుడు ఇస్తారో తెలియక ఎదురుచూపులు తప్పడం లేదు. గతంలో 2, 3 తేదీల్లోనే స్టాక్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం వచ్చేవి. కానీ ఇప్పుడు 8వ తేదీ దాటిన తర్వాతే వస్తున్నాయి. అయితే ఈలోపే బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలి వెళ్తూ నిత్యం ఏదో ఒకచోట పోలీసులకు పట్టుబడుతున్నాయి. వారు పౌరసరఫరాల శాఖకు అప్పగించిన తర్వాత కఠిన చర్యలు లేకపోవడంతో ఆ దందా ఎప్పటికప్పుడు సాగుతూనే ఉంది. పలు రేషన్ షాపుల్లో ఉన్నతాధికారులు తనిఖీలు చేసినప్పుడు లెక్కకు, నిల్వ ఉండే బియ్యానికి పొంతనే ఉండడం లేదు. ఇలాంటి సమయాల్లో ఆ దుకాణాలను సీజ్ చేస్తున్నట్లు పౌరసరఫరాల అధికారులు ప్రకటిస్తుంటారు. అయితే అవి అనతికాలంలోనే తిరిగి తెరుచుకుంటుండడం గమనార్హం. అధికారుల మధ్య సమన్వయ లోపమే రేషన్ దందాకు కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో గత పది రోజులుగా నమోదైన కేసులివీ..

- రామవరంలోని అంబేద్కర్ చెమన్ వెనుక ఓ ఇంట్లో పోలీసులు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.
- బూర్గంపాడు మండలం సారపాక నుంచి ఛత్తీస్‌గఢ్‌కు లారీలో తరలిస్తున్న 300 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.
- దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలో ఓ ఇంట్లో 7 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి.
- పాల్వంచ మండలం నాగారం సమీపంలో ఓ కోళ్లఫాం నుంచి 25 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

జిల్లాలో 443 దుకాణాలు..

జిల్లాలోని 23 మండలాల్లో 443 చౌక దుకాణాలు ఉన్నాయి. 2,93,649 రేషన్‌కార్డులు ఉండగా సుమారు 9.50 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో కనీసం 50 శాతం మంది రేషన్ బియ్యంపై ఆధారపడుతున్న వారే. మరి కొందరు ఒకపూట సన్న బియ్యం, రెండు పూటలు రేషన్ బియ్యం వినియోగిస్తున్నారు. సమయానికి రేషన్ బియ్యం పంపిణీ కాకపోవడంతో వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బియ్యం మాఫియాను అరికడితే అందరికీ సకాలంలో బియ్యం అందుతాయని అంటున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కొంతమంది కూడా అమ్ముకుంటున్నారు. ఇది సరైంది కాదు. పోలీసులు సివిల్ కేసులు, మేము శాఖా పరమైన కేసులు నమోదు చేస్తున్నాం.

– రుక్మిణీదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి

జిల్లాకు ముగ్గురు జడ్జీలు

కొత్తగూడెంటౌన్: జిల్లాకు ముగ్గురు జడ్జీలను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొత్తగూడెం జిల్లా కోర్టు రెండో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా సాయిశ్రీ, మూడో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా శివనాయక్‌ను కేటాయించగా, భద్రాచలం కోర్టు మెజిస్ట్రేట్‌గా సూరిరెడ్డికి పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

వచ్చే నెల 5నుంచి సింగరేణిలో సమ్మె

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో వచ్చే నెల 5, 6, 7వ తేదీల్లో సమ్మె చేపట్టనున్నట్లు ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి.మాధవనాయక్ తెలి పారు. ఈమేరకు గురువారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎస్ఓటూ డైరెక్టర్(పా) వరప్రసాద్‌రావు నోటీసు అందజేశారు. ఈసందర్భంగా మాధవనాయక్ మాట్లాడుతూ 11వ వేజ్‌బోర్డ్ ఒప్పందం ప్రకారం అధికారుల కంటే కార్మికుల వేతనాలు ఎక్కువగా ఉన్నందున సవరించాలని అధికారుల సంఘం బాధ్యులు జబల్పూర్ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారని తెలిపారు. దీంతో కోర్టు సెప్టెంబర్ వేతనాన్ని పదో వేతన కమిటీ ఒప్పందం ప్రకారం చెల్లించాలని తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. దీంతో ఈనెల 14న రాంచీలో సమావేశమైన అన్ని జాతీయ కార్మిక సంఘాలు అక్టోబర్ 5, 6, 7తేదీల్లో సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపా రు. ఇందులో భాగంగా సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్), సీఐటీయూ ఆధ్వర్యాన అధికారులకు నోటీసు ఇచ్చామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీఎస్.పవన్‌కుమార్, మొగిలిపాక రవి, మంద నర్సింహారావు, వైవీ.రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా ఆస్పత్రిలో మరో 30 పడకలు


ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమారస్వామి

కొత్తగూడెంరూరల్ : జిల్లా సర్వజన ఆస్పత్రికి జ్వర బాధితుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో కొత్త వార్డు ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.కుమారస్వామి తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ఆస్పత్రి రెండో ఫ్లోర్‌లో జ్వర బాధితుల కోసం ఇప్పటికే 80 పడకలు ఉన్నాయని, కొత్తగా మరో 30 పడకలతో వార్డు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆగస్టు నుంచి జర్వపీడుతులు పెరుగుతున్నారని, రోజుకు 200 ఓపీ వస్తే, 20 మంది వరకు ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్నారని తెలిపారు. దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, జ్వరం వస్తే తక్షణమే ఆస్పత్రికి రావాలని సూచించారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

ఎన్‌ఏఈ రాష్ట్ర అధ్యక్షుడిగా సంజయ్


సంజయ్‌నాయక్

టేకులపల్లి: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఎన్ఏఈ) రాష్ట్ర అధ్యక్షుడిగా టేకులపల్లి మండలానికి చెందిన డాక్టర్ బానోతు సంజయ్‌నాయక్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన అసోసియేషన్ సమావేశానికి హాజరైన జాతీయ అధ్యక్షుడు, ఓఎన్‌జీసీ మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్.కే.సోనారే సమక్షాన ఈ ఎన్నిక జరిగింది. గత ఏడాది జార్ఖండ్‌లోని ధన్‌బాద్ ఐఐటీ నుంచి సంజయ్ డాక్టరేట్ పొందగా, ఆయన తండ్రి బాలాజీరావునాయక్ భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా పనిచేశారు.

రహదారుల అభివృద్ధికి రూ.17.60 కోట్లు

జూలూరుపాడు: వైరా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రహదారుల నిర్మాణానికి రూ.17.60 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే లావుడ్యా రాములనాయక్ వినతి మేరకు నిధులు కేటాయిస్తూ గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జూలూరుపాడు మండలం అనంతారం నుండి నల్లబోడు తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు, తవిసిగుట్ట నుంచి మాచినేని పేట తండా వరకు రూ.కోటి, బోజ్యాతండా(వెనుక తండా) నుంచి రాజారావుపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి వెచ్చిస్తారు. అలాగే, కొణిజర్ల మండలంలో పీడబ్ల్యూడీ రోడ్డు నుండి లాలాపురం మీదుగా శాంతినగర్ ఎస్టీ కాలనీ వరకు రూ.4.10 కోట్లతో బీటీ రోడ్డు, ఏన్కూరు మండలంలో హిమామ్‌నగర్ నుంచి భద్రుతండా వరకు రోడ్ల అభివృద్ధికి రూ.3.50 కోట్లు, సింగరేణి మండలంలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.3.50 కోట్లు నిధులు మంజూరయ్యారని ఎమ్మెల్యే రాములునాయక్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈమేరకు నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు రశీదు ఇస్తున్న ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన భక్తులు విరాళం అందజేశారు. నూజివీడుకు చెందిన వెంకట సత్యనారాయణ-వరలక్ష్మి దంపతులు గురువారం రూ.50,116 వేల చెక్కును ఆలయ అధికారులకు ఇచ్చాక, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి రేపు స్పాట్ కౌన్సెలింగ్

పాల్వంచరూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 23వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గురుకులాల ఖమ్మం రీజియన్ ఆర్‌సీఓ ప్రత్యూష తెలిపారు. ఏప్రిల్‌లో నిర్వహించిన బ్యాక్‌లాగ్ ప్రవేశపరీక్షలో పాల్గొన్న ఎస్సీ విద్యార్థులు మాత్రమే అర్హులని, సొంతంగా పనులు చేసుకోలేని దివ్యాంగులైన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈమేరకు ఖమ్మంలోని అంబేద్కర్ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం పది గంటలకు మొదలయ్యే కౌన్సెలింగ్‌కు ప్రవేశపరీక్ష హాల్‌టికెట్‌తోపాటు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆర్‌సీఓ సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

ప్రభుత్వాస్పత్రిలో కిటకిట

- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరబాధితులు
- ఇల్లెందులో ఎక్కువగా టైఫాయిడ్ కేసులు నమోదు
- ఓపీ వందల్లో ఉండగా, వైద్యులు నలుగురే..
- పరీక్షలు, రిపోర్టుల కోసం తప్పని పడిగాపులు
- డాక్టర్లు, వైద్య పరికరాలు లేక రోగుల ఇబ్బందులు



ఓపీలో పేరు నమోదు కోసం క్యూ లైన్, (ఇన్‌సెట్) ల్యాబ్ నిండిపోవటంతో క్యాజువాలిటీలో రక్త నమూనా స్వీకరిస్తున్న సిబ్బంది

ఇల్లెందు: వారం రోజులుగా ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు జ్వర పీడితులు క్యూ కడుతున్నారు. టైఫాయిడ్ బాధితులే ఎక్కువగా వస్తున్నారు. రోజూ 500 నుంచి 800 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తుండగా, కనీసం 20 మంది వరకు ఇన్ పేషెంట్‌గా చేరుతున్నారు. ఉదయం 10 గంటలకే 300 ఓపీ నమోదవుతోంది. పేరు నమోదు, డాక్టర్ కోసం, పరీక్షల కోసం ల్యాబ్ వద్ద మూడు గంటలపాటు నిరీక్షించాల్సి వస్తోంది. కేవలం నలుగురు వైద్యులే చికిత్స అందిస్తుండటంతో రోగులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రి వైద్య విధాన పరిషత్‌లోకి మారాక ఇక్కడ మెరుగైన వైద్యం లభిస్తుందనే ఆశతో బాధితులు వస్తున్నారు. అయితే ప్రచారం జరిగిన స్థాయిలో ఆస్పత్రిలో వైద్యం అందడంలేదు. కేవలం నలుగురు ఎంబీబీఎస్‌లే ఉన్నా, వారిలో కొందరు తమ ప్రైవేట్‌గా క్లీనిక్‌లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆస్పత్రిలో జనరల్ వార్డులు తక్కువ ఉండటంతో అత్యవసర రోగులకు బెడ్లు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నెలలో ఇప్పటివరకు 474 టైఫాయిడ్ కేసులు, రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి.

నిధుల కొరత

ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి అభివృద్ధి నిధులు రావడంలేదు. వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి కావడంతో రూ.5 లక్షల వరకు నిధులు అందాల్సి ఉంది. డయాలసిస్ సెంటర్ నిధులూ అందలేదు. ఇక్కడ పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు, వైద్యులకు ఆరు నెలలుగా వేతనాలు విడుదల కావడంలేదు. ఆస్పత్రిలో ఏ వస్తువు కొనుగోలు చేయాల్సి వచ్చినా డ్రాయింగ్ ఆఫీసర్ చేతి నుంచి ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇక ఆరు నెలలుగా ఆరోగ్య శ్రీ బిల్లులు చెల్లించడంలేదు.

ప్రకటనలకే 100 పడకలు

ప్రభుత్వాస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రకటించినా అందుకు తగిన ఆదేశాలు మాత్రం విడుదల చేయలేదు. ప్రస్తుతం 12 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారు. 100 పడకల ఆస్పత్రిగా మారడంతో సుమారు 30 మంది వైద్యులు, 60 మంది నర్సులు, 40 మంది ఇతర సిబ్బందిని కేటాయించాల్సి ఉంది. ఇక్కడ ఏఏ పోస్టులు అవసరమో గుర్తించి మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

పరీక్షల కోసం పడిగాపులు

ప్రభుత్వాస్పత్రిలో వారం రోజులు గడిచినా వైద్య పరీక్షల రిపోర్టులు అందట లేదు. రోజుకు వందల సంఖ్యలో రక్త, మూత్ర పరీక్షలు చేయాల్సి వస్తోంది. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, రక్త కణాల పరీక్షలు చేస్తున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. జ్వరాల తీవ్రత వల్ల ప్రతీ 100 మందిలో 90 మందికి పరీక్షలు నిర్వహించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వీరితోపాటు గర్భిణులకు కూడా పరీక్షలు చేయాల్సి వస్తోంది.

వైద్యపరికరాలు కూడా లేవు

ఆస్పత్రిలో వైద్య పరికరాలు కూడా అందుబాటులో లేవు. సీఏఆర్ఎం -1, డ్రిల్లింగ్ యంత్రం -1, డెంటల్ చైర్-1, స్లిప్ ల్యాంప్-1, ఏఆర్ మిషన్ -1, మైక్రోస్కోప్-1, ల్యాప్రోస్కోపిక్-1 వంటి అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆరు నెలల క్రితం బయోకెమిస్ట్రీ ఎనలైజర్ యంత్రం తెచ్చినా అవగాహన కలిగిన సిబ్బంది లేరు. యంత్రంపై పనిచేయగలిగే ఆపరేటర్‌ను నియమిస్తే 56 రకాల పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. కానీ వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.


ల్యాబ్ వద్ద వేచి చూస్తున్న బాధితులు

రోగుల సంఖ్య పెరిగింది



ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల కాలంలో రోగుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం 54 మంది సాధారణ జ్వర పీడితులు చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో 14 మంది డాక్టర్లు పనిచేస్తున్నారు. ఇక 100 పడకల ఆస్పత్రికి సంబంధించిన ఆదేశాలు, స్టాఫ్ ప్యాట్రన్ కూడా అందాల్సి ఉంది. ఆస్పత్రి మెయింటెనెన్స్ నిధులు విడుదల కావాల్సి ఉంది.

–ఆర్ఎంఓ. డాక్టర్ శిరీష్,
ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల

మాకు న్యాయం చేయండి

సింగరేణి నిర్వాసిత ప్రాంత రైతుల ఆవేదన


తహసీల్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ఇల్లెందురూరల్: తమకు న్యాయం చేయాలని సింగరేణి జేకే ఓసీ ప్రాంత నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు మూడు రోజుల క్రితం కలెక్టర్ ప్రియాంక ఆలను కలిసి సమస్య విన్నవించారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ దృష్టికి తేగా, ఆమె సింగరేణి, రెవెన్యూ, అటవీశాఖ అధికారులను పిలిపించి చర్చించారు. అటవీ, రెవెన్యూ భూముల విభజన చేపట్టాకే నిర్వాసిత ప్రాంత సర్వే చేయాలని సూచించగా, అధికారులు సరేనన్నారు. ఈ క్రమంలో గురువారం రైతులు తహసీల్దార్ రవికుమార్‌ను కలిసి సమస్య వివరించారు. నిర్వాసిత ప్రాంతమైన సర్వే నంబర్ 549లో మొత్తం భూభాగంలో కేవలం 316 ఎకరాలు మాత్రమే అటవీ భూమి ఉందని అటవీశాఖ గెజిట్ స్పష్టం చేస్తోందని, మిగతా భూభాగం మొత్తం రెవెన్యూ పరిధిలోకి వస్తుందని రైతులు తెలిపారు. రెవెన్యూ పరిధిలోని భూములను తాము దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామని, శిస్తు చెల్లించామని, నాటి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నాయని చెప్పారు. సదరు సర్వే నంబర్ భూమి అటవీ, రెవెన్యూ శాఖల మధ్య విభజన జరగకపోవడంతో గిరిజనేతరులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు రాలేదని వివరించారు. అయితే తహసీల్దార్ స్పందిస్తూ గతంలో జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలు చెల్లవని స్పష్టం చేశారు. సదరు సర్వే నంబర్‌లో 600 ఎకరాల భూమి ఉండగా, 360 ఎకరాలు అటవీశాఖ పరిధిలో, 240 ఎకరాలు రెవెన్యూ పరిధిలో ఉందని తెలిపారు. రెవెన్యూ భూమితో మీకే సంబంధం లేదడంతో నిరాశతో రైతులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ అధికారులందరూ ఒక్కటై తమను ఇబ్బంది పెడుతున్నారని, కోర్టుకు వెళ్లండంటూ హెచ్చరిక చేసినట్లు వ్యాఖ్యానించారని వాపోయారు. రెవెన్యూ, అటవీశాఖల సరిహద్దులు నిర్ధారించేవరకు ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్


మాట్లాడుతున్న యెర్రా కామేష్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నడిబొడ్డున రైతు బజార్ పక్కన ప్రభుత్వ స్థలంలో ఇద్దరు ప్రజాప్రతినిధులు తమ కుటుంబ సభ్యుల పేరు మీద ఇంటి నంబర్లు తీసుకొని 480 గజాల భూమికి పట్టాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారని, సుమారు రూ. కోటి విలువైన ప్రభుత్వ భూమి కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్ ఆరోపించారు. గురువారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఇళ్లు లేకపోయినా ఉన్నట్లు, ఆ స్థలాలను వేరే వారి నుంచి కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారని పేర్కొన్నారు. గాజులరాజం బస్తీలో మరో 311 గజాల స్థలం ఇంకో ప్రజాప్రతినిధి భర్త వద్ద కొన్నట్టు రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి, ఖాళీ స్థలంలో ఇంటి పట్టాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జీఓ నంబర్ 76 అధికార పార్టీ నాయకులకు కాసులు కురిపించే కల్పవృక్షంలా మారిందని అన్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నిస్తున్న, సహకరిస్తున్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సలహాదారుడు గంధం మల్లికార్జున్‌రావు, నాయకులు సాయి, నిరంజన్‌కుమార్, మాలోత్ వీరు, వి.రవిశంకర్ పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

దమ్మపేట: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ... గండుగులపల్లి గ్రామానికి చెందిన మంగళగిరి శ్రీహర్షకు, నాగమణితో వివాహం జరిగిన సమయంలో రూ.15 లక్షలు కట్నంగా ఇచ్చారు. కాగా మరో రూ. 5 లక్షలు అదనపు కట్నం తేవాలంటూ భర్తతోపాటు అతడి తల్లి, సోదరుడు నాగమణిని శారీరక, మానసికంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ప్రతాప్ రెడ్డి తెలిపారు.

బెదిరించిన వ్యక్తిపై..

సుజాతనగర్: మద్యం మత్తులో తనపై చేయిచేసుకోవడంతోపాటు తన భర్తను చంపేస్తానంటూ కేశావాపురానికి చెందిన పులి రజనీకాంత్ బెదిరించాడని బాధితురాలు కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రజనీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సోమేశ్వర్ తెలిపారు.

భూమి ఆక్రమించిన వారిపై..

ఇల్లెందు: సీతానగరం గ్రామంలో తనకున్న రెండున్న ఎకరాల భూమిని వజ్జా వీరస్వామి, రవి, వీరమ్మ, వంశీలు దౌర్జన్యంగా ఆక్రమించారంటూ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన వజ్జా పాపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అప్పారావు విచారణ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘర్షణ ఘటనలో..

ఇల్లెందు: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన గుగులోతు రంజిత్ బుధవారం ఓ నాటు కోడిని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న గౌతమ్ చికెన్ షాపులో డ్రెస్సింగ్ కోసం ఇచ్చాడు. డ్రెస్సింగ్ చేసినందుకు రూ.100 చెల్లించాలని కోరగా అందుకు రంజిత్ నిరాకరించి, రూ.50 చెల్లిస్తానన్నాడు. ఈ క్రమంలో చికెన్ షాప్ వర్కర్ నాగేశ్వరరావుతో ఘర్షణ పడి చేయి చేసుకున్నాడు. పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి రూ.లక్ష సాయం


లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

టేకులపల్లి: మండల కేంద్రంలోని లచ్చతండా కు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ భూక్య లక్ష్మణ్ నాయక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం సంస్మరణ కార్యక్రమం జరగ్గా, కుటుంబానికి మృతుడి స్నేహితులు అండగా నిలిచారు. లక్ష్మణ్‌తో పా టు పదో తరగతి చదివిన స్నేహితులు లాలు, తిరుపతి, సూర్య, రవి, మోహన్, రాయుడు, శ్రీకాంత్, భాస్కర్, నరేందర్, వీరస్వామి, శశికళ, రమేష్, వీరన్న, ప్రతాప్ తదితరులు కలిసి రూ. లక్ష ఆర్థికసాయం అందించారు. కాగా మండలంలోని ఫొటోగ్రాఫర్లు ఆమెడ రవి, అలవాల శ్రీనివాస్, హత్తీరాం, భాస్కర్, సంపత్, రమేష్, సైదులు, లక్ష్మణ్, ప్రసాద్, సురేష్, కిట్టు తదితరులు కలిసి మరో రూ. 40 వేల ఆర్థికం సాయం చేశారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలో అనుమతి లేకుండా నడుపుతున్న ఆర్ఎంపీ క్లినిక్‌ను గురువారం సీజ్ చేశారు. బుధవారం మండలంలోని ఓ బాలిక జ్వరంతో మృతి చెందిన సంఘటన విదితమే. ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీ చేయగా, ప్రథమ చికిత్స సర్టిఫికెట్ లేకపోవడంతో సీజ్ చేశామని వైద్యాధికారి రేవంత్ తెలిపారు.

సరిహద్దు గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు

చర్ల: ఈ నెల 21 నుంచి 27 వరకు మావోయిస్టులు వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం మండలంతోపాటు సరిహద్దు గ్రామాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సీఐ రాజగోపాల్ నేతృత్వంలో చర్ల మండలం నుంచి సరిహద్దు ఛత్తీస్‌గఢ రాష్ట్రంలోని అటవీ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులతోపాటు శివారు గ్రామాల్లో సోదాలు చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఆర్.కొత్తగూడెం-కుర్నపల్లి, కలివేరు-పెదమిడిసిలేరు, లక్ష్మీకాలనీ, తాలిపేరు ప్రాజెక్ట్, లెనిన్‌కాలనీ-పూసుగుప్ప మార్గాల్లో తనిఖీలు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓ వివాహిత గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని రామన్నగూడేనికి చెందిన మడకం నాగమణి(28)కి, ఆమె భర్తకు మధ్య బుధవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగుల మందు తాగి మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి శవ పంచనామా జరిపించి, కుటుంబీకులకు అప్పగించారు. మృతురాలి సోదరుడు పి.రామారావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్ష్మీనగరంలో చోరీలు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో రెండు చోట్ల చోరీలు జరిగాయి. గ్రామంలోని నరసింహా కిరాణా దుకాణం షట్టర్‌ను గునపంతో పైకి లేపి లోపలకు ప్రవేశించిన దుండగుడు రూ.10 వేలు చోరీ చేశాడు. అదే గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడు శేఖర్‌బాబు ఇంట్లోకి చొరబడి తాళం పగులకొట్టి బీరువాలోని వస్తువులను చిందరవందరగా పడేశాడు. అయితే ఎటువంటి నగదు, బంగారం చోరీకి గురికాలేదు. చోరీల విషయమై పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని జానకీపురం గ్రామం వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రూ.3.93 లక్షల విలువైన మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. దమ్మపేటకు చెందిన తాండ్ర అనిల్ కుమార్ ఎర్రగుంట వైపు నుంచి తన వాహనంలో 60 కేసుల మద్యం తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశామని ఎస్ఐ షాహీన తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎరియర్స్‌లో కోతలు.. కార్మికుల అసంతృప్తి

మణుగూరు ఏరియాలో 2,434 మంది సింగరేణి కార్మికులకు లబ్ధి



మణుగూరు టౌన్: పదకొండో వేజ్‌బోర్డు ఎరియర్స్‌లో కోతలు విధించడంతో కార్మికులు అసంతృప్తికి గురవుతున్నారు. సింగరేణి యాజమాన్యం గురువారం కార్మికుల ఖాతాల్లో ఎరియర్స్ సొమ్ము జమ చేసింది. మణుగూరు ఏరియాలో 2,434 మంది కార్మికులు లబ్ధి పొందారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ.6 లక్షలకు పైగా సొమ్ము వచ్చింది. కాగా ఏకకాలంలో వచ్చిన 23 నెలల ఎరియర్స్‌ను ఆదాయం పన్ను రూపంలో హరించుకుపోతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. 23 నెలలవి ఒకేసారి వచ్చాయనే ఆనందం ఉన్నప్పటికీ, ఆదాయపు పన్ను 30శాతం, సీఎంపీఎఫ్ 12శాతం, ఫ్యామిలీ పెన్షన్ 7 శాతం పేరుతో మొత్తం 49శాతం కోత పెట్టడంతో కార్మిక కుటుంబాలు పెదవి విరుస్తున్నాయి. ఒక్కో కార్మికుడికి రూ.6 లక్షలు వచ్చాయని యాజమాన్యం చెబుతున్నా ఖాతాల్లో రూ.2.8 లక్షలు నుంచి రూ.3.0 లక్షలే జమయ్యాయని పేర్కొంటున్నారు. 23 నెలల పెరిగిన జీతాన్ని ఆయా సంవత్సరాలకు విభజించి వేర్వేరుగా ఇచ్చి ఉంటే ఆదాయపు పన్ను 30 శాతం స్లాబ్‌గా పరిగణించే అవకాశం ఉండేది కాదని వాపోతున్నారు. 23 నెలల ఎరియర్స్ ఆలస్యంగా ఒకేసారి ఇవ్వడంతో అందరూ కార్మికులు 2023–24 ఆర్థిక సంవత్సరంలో 30శాతం ఆదాయపు పన్ను స్లాబ్ కిందకు వచ్చారని చెబుతున్నారు. కాగా కార్మికుల జీతాల్లో కోతలు పెట్టడం సరికాదని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఇఫ్టూ, హెచ్‌ఎంఎస్, బీఎంఎస్ కార్మిక యూనియన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఎరియర్స్ స్లిప్పులు అందజేత

ఇల్లెందు: అత్యధికంగా ఎరియర్స్ లభించిన ఇల్లెందు ఏరియా ఉద్యోగులకు జీఎం జాన్ ఆనంద్ గురువారం స్లిప్పులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లారపు మల్లయ్య, బొల్లం వెంకటేశ్వర్లు, నరసింహరాజు, యూనియన్ నాయకులు ఎస్. రంగనాథ్ ఎండీ నజీర్ అహ్మద్, ఎస్.సైదులు పాల్గొన్నారు.


ఎరియర్స్ స్లిప్పులు అందజేస్తున్న జీఎం జాన్‌ఆనంద్

సింగరేణి ఉద్యోగులకు చెక్కులు..

సింగరేణి(కొత్తగూడెం): పదకొండో వేజ్‌బోర్డ్ ఎరియర్స్‌లో ఎక్కువ నగదు అందుకున్న కార్పొరేట్ ఉద్యోగులు వై.పద్మజారాణి, పి. నాగలక్ష్మి, ఎండీ అబ్దుల్ అంజద్‌లకు గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఆవరణలో డైరెక్టర్లు సత్యనారాయరావు, ఎన్‌వీకే శ్రీనివాస్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగదును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు దామోదర్ రావు, హనుమంతరావు, కవితానాయుడు, జి. నాగేశ్వరరావు, సుబ్బారావు, సుజాత, ఎం.విజయ్‌భాస్కర్ రెడ్డి, వేణుగోపాలరావు, వెంకటేశ్వరరావు, హరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందుకున్న ఉద్యోగులతో డైరెక్టర్లు

ఇల్లెందులో 'మోడ్రన్' బస్‌షెల్టర్లు

- ఎనిమిది ప్రధాన కూడళ్లలో ఏర్పాటు
- ఒక్కో షెల్టర్‌కు రూ.3.50లక్షల నుంచి రూ.4లక్షల వ్యయం


బస్‌షెల్టర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని మోడ్రన్ బస్‌షెల్టర్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం కొన్నిచోట్ల బస్‌షెల్టర్లు ఉన్నా పాతవి కావడంతో ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. దీంతో ఎండ, వానల్లో ఇబ్బంది పడుతూనూ బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఈ నేపథ్యాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాలతో ఇల్లెందులోని ఎనిమిది చోట్ల మోడ్రల్ బస్‌షెల్టర్లు ఏర్పాటుచేసే పనులు రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఇల్లెందులోని కరెంట్ ఆఫీస్ వద్ద కొత్తగూడెం వెళ్లే రహదారి, ఖమ్మం వైపు వెళ్లే దారుల్లో ఒక్కొక్కటి, జేకే బస్టాప్, ప్రభుత్వ ఆస్పత్రి, బుగ్గవాగు సెంటర్, గోవింద్ సెంటర్‌లో మహబూబాబాద్ వైపునకు వెళ్లే రహదారి వెంట బస్‌షెల్టర్లు సిద్ధమవుతున్నాయి. అంతేకాక రైల్వే లైన్ దాటాక మహబూబాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం ఒకటి, కోర్టు వద్ద గుండాల రోడ్డులో ఇంకొకటి నిర్మిస్తున్నారు. ఇందులో ఒక్కో బస్‌షెల్టరకు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. కాగా, బస్‌షెల్టర్లపై ఓ కంపెనీ యాడ్స్ ప్రదర్శించుకునేందుకు అనుమతివ్వడంతో.. ఆ సంస్థ ఆధ్వర్యాన నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాల పూర్తయ్యాక మున్సిపాలిటీ పర్యవేక్షణ బాధ్యతలు చూడనుంది. అప్పగించనుంది. వాటి పర్యవేక్షణను మున్సిపాల్టీ స్వీకరించనుంది. ఈ సందర్భంగా ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో బస్ షెల్టర్ల నిర్మాణంతో కొత్త కళ సంతరించుకోనుందని తెలిపారు. ఈ షెల్టర్ల వద్ద బస్సులు నిలిపేలా ఆర్టీసీ అధికారులకు లేఖ రాస్తామని వెల్లడించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


కృష్ణబాబు(ఫైల్)

దుమ్ముగూడెం : మండలంలోని లచ్చిగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి కృష్ణబాబు(25) విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కృష్ణబాబు మోటార్ ఆన్ చేసేందుకు పొలం దగ్గరకు వెళ్లాడు. ఎంతసేపయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం దగ్గరకు వెళ్లి చూడగా.. కృష్ణబాబు పొలంలో మోటార్ దగ్గర విగత జీవిగా పడి ఉన్నాడు. పొలంలో విద్యుత్ మోటార్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.